
www.aakshitha.com
People's voice
# అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY
తెలంగాణ దిక్సూచి
బుధవారం | 09 | సెప్టెంబర్ | 2026 | పేజీలు: 08



## పటిష్టంగా గణేష్ ఉత్సవాలు

### జిల్లా కలెక్టర్ కె. హరిత

ఆసిఫాబాద్, అక్షిత ప్రతినిధి: వినాయక చవితి సందర్భంగా జిల్లాలో ఏర్పాటు చేసే వినాయక మండపాలు, నిమజ్జన కార్యక్రమాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన బందోబస్తు, అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. మంగళ వారం సమీకృత కలెక్టరెట్ భవన సముదాయము లోని సమావేశ మందిరములో ..మిగతా 2లో



## వేగిరంగా భూ సేకరణ
# పనులు

### అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్



**నల్గొండ, అక్షిత ప్రతినిధి :** ఇరిగేషన్ ప్రాజక్టుల భూసేకరణ పనులు వేగవంతం చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె .శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు మంగళవారం ఆయన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో భూసేకరణ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు భూములు ఇచ్చిన రైతులకు చేసిన చెల్లింపులు, పాసైనా అవార్డులు, తదితర వివరాలను అధికారులతో అడిగి తెలుసుకున్నారు.భూసేకరణ పూర్తయిన ప్రాంతాల్లో అవార్డులు త్వరితగతిన పాస్ చేసి ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని చెప్పారు.పెండింగ్‌లో ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీర్లకు సూచించారు.భూసేకరణ, పరిహారం చెల్లింపులు, నిర్మాణ పనుల మధ్య సమన్వయం పెంచి నిర్ణీత ..మిగతా 2లో

## పారదర్శకంగా
# సర్ ప్రక్షాళన

### కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మహబూబ్ నగర్,అక్షిత ప్రతినిధి: హన్వాడ మండలం నాయినోనిపల్లి గ్రామంలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతి గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐఆర్ ఫారాల్లో నమోదైన వివరాల్లో తప్పులను ఎలా సరిచేస్తున్నారు, ఇప్పటివరకు ఎంతమంది ఓటర్లకు నోటీసులు జారీ చేశారు, ఇంకా ఎన్ని నోటీసులు పెండింగ్‌లో ఉన్నాయి, ఎన్ని కేసుల్లో సవరణలు పూర్తయ్యాయి తదితర వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల జాబితాలో ఇంటిపేరు, ఓటరు పేరు, ఫొటో తదితర వివరాల్లో తేడాలు ఉన్నట్లయితే వాటిని నిబంధనల ప్రకారం సరిచేయాలని అధికారులకు సూచించారు. ఓటర్ల జాబితాలో అర్హత కలిగిన వారి పేర్లు తొలగిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఫొటోల్లో తప్పులు ఉంటే వాటిని సరిచేయడంతో పాటు, పేరు లేదా ఇంటిపేరులో మార్పులు అవసరమైతే సంబంధిత ఆధారాలను పరిశీలించి సవరణలు చేయాలని సూచించారు.
ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా జారీ చేసిన నోటీసుల వివరాలను కూడా కలెక్టర్ తెలుసుకున్నారు. నోటీసులు జారీ చేసిన అనంతరం సంబంధిత ఓటర్లకు విచారణ (హియరింగ్) నిర్వహిస్తున్నారా, ప్రతిరోజూ ఎంతమంది విచారణకు హాజరవుతున్నారు, వారి స్పందన ఎలా ఉందనే విషయాలను ..మిగతా 2లో



## రుణ లక్ష్యాల సాధనకు బ్యాంకర్లు
# సమన్వయంతో పనిచేయాలి

### అర్హులైన ప్రతి ఒక్కరికి రుణాలు అందేలా చర్యలు

### కలెక్టర్ భవేష్ మిశ్రా

నిర్మల్, అక్షిత ప్రతినిధి: జిల్లా ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేసేందుకు నిర్దేశించిన వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాలను వంద శాతం సాధించాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా బ్యాంకర్లను ఆదేశించారు. అర్హులైన రైతులు, విద్యార్థులు, యువత, మహిళా స్వయం సహాయక సంఘాలు, చిన్న వ్యాపారులకు రుణాలు సకాలంలో అందేలా బ్యాంకర్లు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు.
మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన డీసీసీ, డీఎల్ఆర్సీ సమావేశంలో 2026--27 వార్షిక రుణ ప్రణాళిక, ప్రభుత్వ పథకాల రుణాల మంజూరు, ప్రాధాన్యతా రంగాలకు ఆర్థిక సహాయం, సామాజిక భద్రతా పథకాల అమలుపై కలెక్టర్ సమీక్షించారు.
2026--27 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలోని బ్యాంకులకు రూ.7,952.87 కోట్ల రుణ లక్ష్యం నిర్దేశించగా ఇప్పటివరకు రూ.2,331.18 కోట్లు (29.31 శాతం) సాధించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రాధాన్యతా రంగాలకు నిర్దేశించిన రూ.6,661.73 కోట్ల లక్ష్యానికి గాను రూ.1,847.71 కోట్లు (27.74 శాతం) సాధించారని పేర్కొన్నారు. ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి లక్ష్యాలను ..మిగతా 2లో

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY
బుధవారం |09| సెప్టెంబర్ | 2026

## పారదర్శకంగా సర్ ప్రక్షాళన

**మొదటి పేజీ తరువాయి...**

అధికారులను అడిగి తెలుసుకున్నారు. విచారణకు ఓటర్లు హాజరవుతున్న తీరు, ప్రజల స్పందనపై అధికారులు కలెక్టర్‌కు వివరించారు. విచారణ ప్రక్రియ సజావుగా కొనసాగుతోందని, నోటీసులు అందుకున్న ఓటర్లు విచారణకు హాజరవుతున్నారని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హన్వాడ తహసీల్దార్ కిష్ట్యా నాయక్, ఆర్.డి.ఓ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## వేగిరంగా భూ సేకరణ పనులు

**మొదటి పేజీ తరువాయి...**

గడువులోగా పనులు పూర్తి చేయాలని అన్నారు. భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ (పునరావాస మరియు పునర్నిర్మాణ) కింద కల్పించాల్సిన సౌకర్యాలు, ప్రయోజనాలను వేగంగా అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రాజక్టుల అమలులో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశానికి దేవరకొండ సబ్ కలెక్టర్ కరోలిన్ చింగ్ థియాన్ మావి , ఏ ఎం ఆర్ పి భూసేకరణ స్పెషల్ కలెక్టర్ డి. మాధురి ఇంజనీర్లు, అధికారులు హాజరయ్యారు.

## దళిత స్పీకర్‌పై అహంకార వ్యాఖ్యలు రాజ్యాంగానికే అవమానం....!

**ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు దొండి రమణ....**

**వెంటనే క్షమాపణ చెప్పాలి.. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు: దొండి రమణ..**



**ఆర్మూర్, అక్షిత ప్రతినిధి:** ఆర్మూర్: తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అసెంబ్లీ ప్రాంగణంలో రాజ్యాంగబద్ధమైన సభాపతి పదవిలో ఉన్న దళిత నేత గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు పేర్కొంటున్న అనుచిత వ్యాఖ్యలను బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు దొండి రమణ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసి బీఆర్ఎస్ నేతల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సభాపతి స్థానంలో ఉన్న వ్యక్తిని ఉద్దేశించి ఇష్టారీతిన వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థను, రాజ్యాంగ విలువలను అవమానించడమేనని దొండి రమణ అన్నారు. దళిత నాయకుడు అత్యున్నత రాజ్యాంగ పదవిలో కొనసాగడాన్ని ఓర్వలేకే బీఆర్ఎస్ నేతలు దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు, దళిత సమాజానికి తాతా మధుతో పాటు బీఆర్ఎస్ అధినాయకత్వం వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని దొండి రమణ డిమాండ్ చేశారు. సభాపతి గౌరవాన్ని కించపరిచేలా అసెంబ్లీ ప్రాంగణంలో వ్యవహరించిన ఎమ్మెల్సీ తాతా మధుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. బీఆర్ఎస్ నాయకుల వ్యవహారశైలి ఆ పార్టీ అహంకార రాజకీయాలకు నిదర్శనంగా మారిందని ఆయన విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన పదవులను, ప్రజాస్వామ్య సంప్రదాయాలను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ నాయకుడిపైనా ఉందన్నారు. తాతా మధు తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దళిత, బహుజన సంఘాలను కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు తీవ్రతరం చేస్తామని దొండి రమణ హెచ్చరించారు. బీఆర్ఎస్ రాజకీయాలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, ఆ పార్టీ తిరిగి అధికారంలోకి రావడం కల్లేనని అన్నారు. ప్రజా సమస్యలపై దృష్టి పెట్టకుండా వ్యక్తిగత విమర్శలు, దిగజారుడు రాజకీయాలకు పాల్పడటం బీఆర్ఎస్ నాయకత్వానికి అలవాటుగా మారిందని దొండి రమణ మండిపడ్డారు

# రుణ లక్ష్యాల సాధనకు బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలి




**మొదటి పేజీ తరువాయి...**

వంద శాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. విద్యా రుణాల మంజూరు తక్కువగా ఉందని పేర్కొన్న కలెక్టర్, అర్హులైన విద్యార్థులకు అధిక సంఖ్యలో రుణాలు అందించాలని ఆదేశించారు. జిల్లాలో బ్యాంకు ఖాతాలు లేని ప్రతి ఒక్కరికీ సెప్టెంబర్‌లోగా ఖాతాలు తెరవాలని సూచించారు. విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, కాస్మోటిక్ ఛార్జీల జమ



కోసం లక్ష్యంగా పెట్టుకున్న 3,500 ఖాతాల్లో ఇప్పటికే 1,022 కొత్త ఖాతాలు ప్రారంభించినట్లు తెలిపారు.

పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, పీఎం విశ్వకర్మ, పీఎం స్వనిధి, ఎస్‌హెచ్‌జీ బ్యాంక్ లింకేజీ తదితర పథకాల అమలును కలెక్టర్ సమీక్షించారు. రుణ లక్ష్యాల సాధనకు జిల్లా పరిశ్రమల శాఖ బ్యాంకర్లతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ఎస్‌హెచ్‌జీ బ్యాంక్ లింకేజీ, పీఎం స్వనిధి రుణాల్లో ఎన్‌పీఏలను తగ్గించేందుకు మున్సిపల్ కమిషనర్లతో సమావేశాలు నిర్వహించాలని ఎల్‌డీఎంను సూచించారు. మొండి బకాయిల వసూళ్లకు సీబీఆర్ఎం బృందాల సేవలను వినియోగించుకోవాలని, అన్ని బ్యాంకులను సమన్వయం చేస్తూ మెరుగైన పనితీరు సాధించాలని ఎల్‌డీఎంను ఆదేశించారు. ఎస్‌హెచ్‌జీ బ్యాంక్ లింకేజీ లక్ష్యాలను పూర్తి చేయడంతోపాటు డిజిటల్ ఎంసీపీ సమస్యలను పరిష్కరించాలని పీడీ డీఆర్‌డీఏకు సూచించారు.

విజయ డెయిరీతో టైఅప్ ద్వారా రైతులకు పాడి పశువుల కొనుగోలుకు రుణాలు అందించే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. పాడి పశువులకు అవసరమైన ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలను జారీ చేయాలని జిల్లా పశువైద్యాధికారిని ఆదేశించారు. డెయిరీ యూనిట్లకు బ్యాంకులు అవసరమైన ఆర్థిక సహకారం అందించాలని కోరారు.

రైస్ మిల్లుల ఫైనాన్స్‌కు అవసరమైన ఎన్‌ఓసీలు, బ్యాంకు గ్యారెంటీల జారీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేందుకు సంబంధిత శాఖలు బ్యాంకులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై వంటి సామాజిక భద్రతా పథకాల కింద మరణించిన లబ్ధిదారుల కుటుంబాలకు అందిన క్లెయిమ్‌లను విజయగాథలుగా ప్రచారం చేయాలని కలెక్టర్ సూచించారు. అలాగే ఎల్‌నినో ప్రభావం జిల్లాలోని క్రెడిట్ పోర్ట్‌ఫోలియోపై ఎలా ఉండొచ్చో అంచనా వేసి నివేదిక అందించాలని ఎల్‌డీఎంను ఆదేశించారు.

ఈ సమావేశంలో ఎల్‌డీఎం బి. రామ్‌గోపాల్, ఆర్‌బీఐ ఏజీఎం, ఎల్‌బీఓ ఎస్. రాములు, పీడీ డీఆర్‌డీఏ విజయలక్ష్మి, ఆర్ఎం నవీన్ పురం, సీఎం క్రెడిట్ ఆర్‌బీఓ ఆదిలాబాద్ పియూష్, వివిధ బ్యాంకుల అధికారులు, నాబార్డ్, ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పటిష్టంగా గణేష్ ఉత్సవాలు

**మొదటి పేజీ తరువాయి...**

వినాయక మండపాలు, నిమజ్జన కార్యక్రమాల ఏర్పాట్లపై అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఎస్పీ నితిక పంత్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మార్మట్, అదనపు కలెక్టర్ రెవిన్యూ ఎం. డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ రాజాశ్వ మండలాధికారి లోకేశ్వర రావ్ ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ జోస్తిన్ జోల్ తో కలిసి కలెక్టర్ కే హరిత సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వినాయక మండపాల వద్ద భద్రతా చర్యలను పకడ్బందీగా చేపట్టాలని, నిమజ్జనం జరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, అగ్నిమాపక మరియు వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచాలని తెలిపారు.

విద్యుత్ శాఖ అధికారులు మండపాలు, నిమజ్జన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు సంబంధించి భద్రతా చర్యలు చేపట్టాలని, మున్సిపల్ అధికారులు పారిశుద్ధ్య ఏర్పాట్లు, మిషన్ భగీరథ అధికారులు తాగునీటి





సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. అగ్నిమాపక శాఖ, నీటిపారుదల శాఖ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు తమ పరిధిలో అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. నిమజ్జన ప్రదేశములో అవసరమైన ఏర్పట్లుచేపట్టాలని కాగజనగర్ ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలోని వినాయక నిమర్జనం క్రెన్ లు అందుబాటులో ఉండేలా గజా ఇతగాళ్ళను ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు సోషల్ మీడియాలో వచ్చే ప్రచారాల పై అప్రమత్తంగా ఉండాలన్నారు.

నిమజ్జన కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో జరిగేలా అన్ని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు కూడా అధికారులకు సహకరించి నిబంధనలు పాటిస్తూ వినాయక నిమజ్జన కార్యక్రమాలను విజయవంతం చేయాలనీ కోరారు. ఈ సమీక్షా సమావేశం లో ఆసిఫాబాద్ కాగజనగర్ డి ఎస్ పి లు అశోక్ వహిదోద్దీన్ విద్యుత్ శాఖ ఎస్ ఈ ఉత్తమ్ ఝాడే డి పి ఓ బిక్షపతి డి ఎం హెచ్ ఒ నాగేంద్ర మున్సిపల్ కమిషనర్లు తిరుపతి అంజయ్య తహసీల్దార్లు మధుకర్ రియజ్ అలీ సంబంధిత శాఖలా అధికారులు పాల్గొన్నారు.

# అక్షరాస్యతతోనే సమాజ ప్రగతి

**ప్రతి ఒక్కరూ విద్యావంతులుగా ఎదగాలి**

**జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

మహబూబ్ నగర్,అక్షిత న్యూస్: అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మంగళవారం ఘనంగా అక్షరాస్యత అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా పరిషత్ మైదానం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా పరిషత్ మైదానం నుంచి ప్రారంభమైన ర్యాలీ మల్లికార్జున్ ఎంటర్‌ప్రైజెస్ మీదుగా కొనసాగి అంబేద్కర్ చౌరస్తా వద్ద ముగిసింది. ర్యాలీలో పాఠశాల విద్యార్థులు, మహిళలు, ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్స్,వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం ద్వారా అక్షరాస్యత కేవలం చదవడం, రాయడం నేర్చుకోవడమే కాకుండా వ్యక్తి సాధికారతకు, కుటుంబ అభివృద్ధికి, సమాజ పురోగతికి పునాది అని అన్నారు. ప్రతి ఒక్కరూ విద్యను అందిపుచ్చుకొని తమ హక్కులు, బాధ్యతలు తెలుసుకోవాలని సూచించారు.








"అక్షరం ప్రతి ఒక్కరి హక్కు -- విద్య ప్రతి కుటుంబానికి బలం. నిరక్షరాస్యతను నిర్మూలించి, ప్రతి వ్యక్తిని అక్షరాస్యుడిగా తీర్చిదిద్దడం మనందరి సామాజిక బాధ్యత" అని కలెక్టర్ పేర్కొన్నారు. అక్షరాస్యత పెరిగితే ప్రజల్లో అవగాహన, ఆత్మవిశ్వాసం, ఉపాధి అవకాశాలు పెరిగి సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

వయోజన విద్యా శాఖ ఉప సంచాలకులు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ

ప్రజల్లో అక్షరాస్యత ప్రాధాన్యతపై అవగాహన కల్పించడం, నిరక్షరాస్యులను విద్య వైపు ప్రోత్సహించడం, "ప్రతి ఒక్కరూ చదవాలి -- ప్రతి ఒక్కరూ ఎదగాలి" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం లక్ష్యంగా ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమాన్ని వయోజన విద్యా శాఖ, మహబూబ్‌నగర్ కింద నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జడ్.పి.సి.ఈ.ఓ వెంకట రెడ్డి, డి.ఈ.ఓ విజయ కుమారి,డి.ఆర్.డి.ఓ నర్సింహులు, వయోజన విద్యా శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ఖరీఫ్ పంటలు నమోదు చేయించుకోవాలి

**వ్యవసాయ విస్తరణ అధికారి సురేందర్**




గద్వాల అక్షిత న్యూస్: ఇటిక్యాల మండలం చాగాపురం గ్రామ రైతులు ఖరీఫ్ లో వేసిన పంటల వివరాలను నమోదు చేయించుకున్న గలరని వ్యవసాయ విస్తరణ అధికారి సురేందర్ రైతులకు తెలియజేశారు. కావున రైతు సోదరులు మీ యొక్క భూమి పాస్ బుక్ తీసుకొని వచ్చి రైతువేదిక దగ్గర పంట నమోదు చేయించుకోగలరని మనవి. పంట నమోదు చేయించక పోతే ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల దగ్గర అమ్మడానికి అవకాశంఉండదు. మరియు యాసంగి రైతు భరోసా రైతుల ఖాతాలలో నగదు జమచేయబడద నీ వ్యవసాయ విస్తరణ అధికారి సురేందర్ రైతులకు తెలియజేశారు. కావున రైతులు వారి వారి పంట వివరాలు తప్పకుండా నమోదు చేయించుకుని సహకరించగలరని వ్యవసాయ అధికారి సురేందర్ తెలియజేశారు.

# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునికి పాఠశాలలో ఘనంగా సన్మానం



నడిగూడెం, అక్షిత న్యూస్: అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (హెచ్ డబ్ల్యూ)రామాపురం నందు ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డును స్వీకరించిన సెకండరీ గ్రేడ్ టీచర్ బండ్ల ఏడుకొండలు ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే.గోపయ్య,అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ రాధిక పాఠశాల విద్యార్థుల సమక్షంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు బండ్ల ఏడుకొండలు మాట్లాడుతూ చిన్నతనం నుండి గురువులపై మక్కువతోనే ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించానని, మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థుల అవసరాలకు,భవిష్యత్తు అవసరాలకు తగిన విధంగా విద్యాబోధనను నిర్వహిస్తున్నామని, పాఠశాలలో మౌలిక వసతులను ఏర్పాటు చేస్తూ, జిల్లాలోనే పాఠశాలను ప్రథమ స్థాయిలో నిలిపేందుకు కృషి చేస్తామని, ఎఫ్ ఎల్ ఎన్ కార్యక్రమాలను పాఠశాల స్థాయిలో పూర్తిగా అమలుపరుస్తామని, ఈ అవార్డు స్వీకరణతో నా బాధ్యత మరింత పెరిగిందని అన్నారు.గ్రామంలోని విద్యార్థులను ఉన్నత స్థాయిలో తీర్చిదిద్ది, వారిలోని ప్రతిభా పాటవాలను వెలికి తీసి విద్యార్థుల భవిష్యత్ ఉన్నత స్థాయిలో నిలపటమే తన లక్ష్యమని వివరించారు.

## పారిశుద్ధ్య కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



మహబూబ్ నగర్,అక్షిత న్యూస్: స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ మంగళవారం మహబూబ్‌నగర్ లోని మోడ్రన్ స్కూల్‌లో నిర్వహించిన పారిశుద్ధ్య కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ తొలగించిన చెత్తను స్వయంగా ఎత్తి పరిశుద్య పనుల్లో చురుగ్గా పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను తొలగించడంతో పాటు పరిసరాల్లో పెరిగిన పిచ్చి మొక్కలు, పొదలను తొలగించారు. పరిశుభ్రతను పాటించడం ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసుకోవచ్చని మధుసూదన్ నాయక్ అన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పరిశుభ్రత కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని పాఠశాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచాలని ఆయన సూచించారు. స్వయంగా పారిశుద్ధ్య పనుల్లో పాల్గొని ఇతరులకు ఆదర్శంగా నిలిచారు.

## అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా విద్యార్థులు అవగాహన ర్యాలీ





చిలుకూరు, సెప్టెంబర్ 8 అక్షిత న్యూస్: చిలుకూరు మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రామాపురం విద్యార్థులు మంగళవారం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా విద్యార్థులు అందరికీ విద్య--అందరికీ అక్షరాస్యత, అక్షరాస్యతతోనే అభివృద్ధి, చదువు మన హక్కు--చదువు మన భవిష్యత్తు వంటి నినాదాలతో గ్రామ ప్రజలకు అక్షరాస్యత ప్రాధాన్యతను తెలియజేశారు. విద్య వ్యక్తిగత వికాసానికే కాకుండా కుటుంబ, సామాజిక, ఆర్థిక అభివృద్ధికి పునాది అని విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్.జి. శివకుమారి, ఉపాధ్యాయులు టి.వై.ఎల్.ఎన్. స్వామి, ఐ. రామాంజలి దేవి, చందా రాములు, ఎస్. అరుంధతి, డి. వెంకట్ రెడ్డి, ఎన్. పరిమళమ్మ, కె. వెంకన్న, కదిర బ్రహ్మారెడ్డితో పాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ, "అక్షరాస్యత అనేది కేవలం చదవడం, రాయడం నేర్చుకోవడం మాత్రమే కాదు.. హక్కులను తెలుసుకొని, బాధ్యతలను నిర్వర్తిస్తూ, సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావడానికి అవసరమైన శక్తి" అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ విద్యావంతులై సమాజాన్ని ప్రగతి పథంలో నడిపించాల్సిన అవసరం ఉందన్నారు.విద్యార్థులు నిర్వహించిన ర్యాలీ గ్రామ ప్రజలను ఆకట్టుకోవడంతో పాటు అక్షరాస్యతపై చైతన్యం కల్పించింది.

## చారిత్రక ప్రదేశాల పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన

### డ్రగ్స్ దుష్ప్రభావాలపై సాంస్కృతిక ప్రదర్శనలతో చైతన్యం




**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** ప్రభుత్వ జూనియర్ కళాశాల, రామన్నపేట ఆధ్వర్యంలో యువ టూరిజం క్లబ్, యాదాద్రి భువనగిరి జిల్లా సూచనల మేరకు విద్యార్థులకు చారిత్రక ప్రదేశాలపై అవగాహన కల్పించడంతో పాటు డ్రగ్స్ నివారణపై చైతన్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు రామన్నపేట మండలంలోని చారిత్రక ప్రదేశాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులను విష్ణుకుండినుల రాజధానిగా ప్రసిద్ధి చెందిన ఇంద్రపాలనగరానికి తీసుకెళ్లారు. అక్కడి చారిత్రక ప్రదేశాలు, వాటి విశిష్టత, చారిత్రక నేపథ్యాన్ని విద్యార్థులకు వివరించారు. చారిత్రక వారసత్వ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అవగాహన కల్పించారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక కళావేదిక బృందం కళాశాలను సందర్శించి పాటలు, సాంస్కృతిక ప్రదర్శనలు, మాటల ద్వారా డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించింది. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని విద్యార్థులకు చైతన్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జగదీష్, అధ్యాపకులు, తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక కళావేదిక బృందం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

### ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకోవాలి

### ప్రిన్సిపాల్ విజయ నాయక్



**నడిగూడెం, అక్షిత న్యూస్:** విద్యతోనే సమాజంలో గుర్తింపు విద్యతోనే నేటి సమాజంలో గుర్తింపు లభిస్తుందని సన్మార్గము సత్ప్రవర్తనతో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని లక్ష్యసాధనకు కృషి చేయాలని నడిగూడెం కే ఎల్ ఎన్ కళాశాల ప్రిన్సిపాల్ విజయ నాయక్ కోరారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం పురస్కరించుకొని జాతీయ సేవా పథకం యూనిట్ 1, అండ్ 2 ఆధ్వర్యంలో మంగళవారం కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులను శాలువలతో సత్కరించారు. జాతీయ సేవా పథకం యూనిట్ అధికారులు కర్నాటి శ్రీధర్,జి.నాగరాజు అధ్యాపకులు కృష్ణ ,మహేష్ ఉపేందర్,ఈశ్వర్,రజిత వెంకటేశ్వరరావు,కొల్లు శ్రీనివాస్,డి శ్రీనివాసరావు, తేజస్విని,హేమ,నాగరాణి,శైలజ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి పెద్దపీట

### సూర్యాపేట మున్సిపాలిటీ కొత్త మాస్టర్ ప్లాన్‌కు ఆమోదం

### అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

### 120 మంది పారిశుద్ధ్య కార్మికుల పీఎఫ్‌ను వారి ఖాతాల్లో జమ చేసేందుకు నిర్ణయం

### సూర్యాపేట మున్సిపాలిటి సాధారణ కౌన్సిల్ సమావేశంలో చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది



**సూర్యాపేట , అక్షిత బ్యూరో :** సూర్యాపేట మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ మున్సిపల్ పాలక మండలి సభ్యులు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.ఈ సమావేశ ఎజెండాలో పలు అంశాలు పొందుపరచగా వాటికి పాలక మండలి ఆమోదం తెలిపింది.మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అధ్యక్షతన మంగళవారం జరిగిన మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశంలో పట్టణ అభివృద్ధి, పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం,మౌలిక వసతుల కల్పనపై కౌన్సిల్ సభ్యులు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.గత రెండు రోజుల క్రితం పారిశుద్ధ్య కార్మికులు మున్సిపల్ చైర్‌పర్సన్ ని కలిసి,ప్రతి ఏటా తమకు అందజేయాల్సిన సబ్బులు, బట్టలు,కొబ్బరినూనె వంటి తదితర సంక్షేమ సామగ్రిని అందించాలని విజ్ఞప్తి చేయగా స్పందించిన చైర్ పర్సన్ అట్టి అంశాలపై సమావేశంలో కౌన్సిల్ ఆమోదం తెలిపింది.గత 4 సంవత్సరాల 9 నెలలుగా కార్మికుల పీఎఫ్ చెల్లింపులు పెండింగ్‌లో ఉన్న 120 మందికి అట్టి మొత్తాన్ని వారి ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించారు. కార్మికుల హక్కులు, సంక్షేమాన్ని పరిరక్షించడంలో మున్సిపాలిటీ బాధ్యతగా వ్యవహరిస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. పట్టణ సమగ్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రూపొందించిన కొత్త మాస్టర్ ప్లాన్‌లో భాగంగా పట్టణ విస్తరణ, రహదారులు, మౌలిక వసతులపై సభ్యులు ఆమోదం తెలిపారు.పట్టణంలోని 60 ఫీట్ల రోడ్డు నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు రహదారిని అనుసంధానం చేయడంపై సమావేశంలో చర్చించారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి అందించాలని నిర్ణయించారు.పట్టణంలో చాలా కాలంగా కొనసాగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించారు.ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన ఎండీ షఫీ ఉల్లా,మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్ తో పాటు పలువురు కౌన్సిలర్లు పట్టణ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం వంటి అంశాలపై పలు సూచనలు చేశారు.పట్టణ భవిష్యత్ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని కౌన్సిల్ సమిష్టిగా కీలక నిర్ణయాలు తీసుకుంటోందని,పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు మున్సిపాలిటీ నిరంతరం కృషి చేస్తుందని చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది ఈ సందర్భంగా తెలిపారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమీషనర్ హన్మంత రెడ్డి,మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గణేష్ మండపాల నిర్వహణకు ఆన్లైన్ అనుమతి తప్పనిసరి

### ప్రజలు, నిర్వాహకులు పోలీసులకు సహకరించాలి

### గణేష్ మండపాల వద్ద భద్రతా చర్యలను తప్పక పాటించాలి...

### నారాయణపురం ఎస్ఐ సీతా పాండు




**చౌటుప్పల్ /అక్షిత న్యూస్:** ఈనెల 14వ తేదీ నుంచి నిర్వహించనున్న గణేష్ చతుర్థి ఉత్సవాల సందర్భంగా మండపాల ఏర్పాటుకు సంబంధించి నిర్వాహకులు ముందస్తుగా ఆన్లైన్ ద్వారా అనుమతి పొందాలని నారాయణపురం ఎస్ఐ సీతా పాండు తెలిపారు.గణేష్ ఉత్సవాల సందర్భంగా మండపాల ఏర్పాటుకు అవసరమైన పోలీస్ అనుమతులను నిర్వాహకులు తెలంగాణ స్టేట్ పోలీస్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో పొందాలని సోమవారం నారాయణపురం ఎస్ఐ సీతా పాండు పత్రికా ప్రకటన ద్వారా సూచించారు.

గణేష్ ఉత్సవాల కోసం మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు ముందుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, అందులో మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, నిర్వాహకుల వివరాలు, ఇతర అవసరమైన సమాచారాన్ని నమోదు చేయాలని తెలిపారు. సంబంధిత పోలీస్ అధికారులు వివరాలను పరిశీలించిన అనంతరం అనుమతి జారీ చేస్తారని పేర్కొన్నారు.క్యూ ఆర్ /డిజిటల్ ఎన్.ఓ.సి ద్వారా అనుమతి పొందే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా గణేష్ ఉత్సవాల సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా మండపాలు ఏర్పాటు చేయడం, విద్యుత్ భద్రతా ప్రమాణాలు పాటించడం, అగ్నిప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవడం, శబ్ద కాలుష్య నియంత్రణ నిబంధనలు పాటించడం వంటి భద్రతా చర్యలను తప్పనిసరిగా పాటించాలని నిర్వాహకులకు ఎస్ఐ సీతా పాండు సూచించారు. అనుమతులు లేని ప్రదేశాలలో మండపాలు ఏర్పాటు చేయరాదని తెలిపారు. ప్రజలు, నిర్వాహకులు పోలీసులకు సహకరిస్తూ ఉత్సవాలను శాంతియుతంగా, భద్రతతో నిర్వహించుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ సహాయం కోసం 100 / 112కు కాల్ చేయాలని ఎస్సై సీతా పాండు సూచించారు.

## రాజ్యాంగ పదవిలో ఉన్న స్పీకర్‌ను దూషించటం బాధాకరం

### మండల పార్టీ అధ్యక్షులు మొక్క బిక్షపతి



**నడిగూడెం,అక్షిత న్యూస్:** రాజ్యాంగ పదవిలో ఉన్న స్పీకర్ గడ్డం ప్రసాద్ ను బిఆర్ఎస్ నాయకులు దూషించటం చాలా బాధాకరం అని మండల పార్టీ అధ్యక్షులు మొక్క బిక్షపతి తెలిపారు.తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ప్రాంగణంలో మంగళవారం నాడు అసెంబ్లీ సాక్షిగా బిఆర్ఎస్ నాయకులు రాజ్యాంగ పదవి లో ఉన్న స్పీకర్ ను,వారి తల్లి ని బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ తాత మధు ఇష్టం వచ్చినట్టుగా అవమానకరమైన పదజాలంతో తిట్టడం హేయమైన చర్య అని అన్నారు. దళితుడైనా స్పీకర్ ను అటువంటి పదజాలంతో తిట్టడం యావత్ దళితులందరిని అవమానపరిచినట్లుగా భావించి దళితులందరూ బిఆర్ఎస్ పార్టీ, ఎమ్మెల్సీ తాత మధుకి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. బిఆర్ఎస్ పార్టీ అధినేత కెసిఆర్ దళితుల పట్ల చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఎమ్మెల్సీ తాత మధును పార్టీ నుంచి బహిష్కరించాలని ఎమ్మెల్సీ పదవిని రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన అన్నారు. బిఆర్ఎస్ అధ్యక్షులు కేసిఆర్ స్పీకర్ పై తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఇప్పటివరకు స్పందించ పోవడం దురదృష్టకరం అని అన్నారు. ప్రజా పాలన లో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉందని సన్న బియ్యం, ఉచిత కరెంటు, మహిళలకు ఫ్రీ బస్సు, కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు వంటి అనేక రకాల సంక్షేమ కార్యక్రమాల తోటి అభివృద్ధి లో ప్రజా పాలన ప్రభుత్వం 1000 రోజులు పూర్తి చేసుకుంటే ఓర్వలేక బిఆర్ఎస్ నాయకులు ప్రజా ప్రభుత్వం పై నిరసన పేరు మీద అక్కసు వెల్లబుచ్చుకుంటున్నారని అన్నారు. ప్రజా పాలన సక్రమంగా కొనసాగుతుంటే అక్కసు తో నిరసనల పేరిట ఎదురుదాడి చేస్తూ ప్రజా పాలన విఫలం చెందిందని ప్రజలను మోసపూరితమైన విధానాల ద్వారా నమ్మిస్తున్నారని తెలిపారు.మీ జిమ్మిక్కులు మానుకోవాలని లేకపోతే 2029 లో కూడా 2024 లో వచ్చిన ఫలితమే పునర వృతం అవుతుందని బిఆర్ఎస్ పార్టీకి తెలంగాణ ప్రజలు,దళితులు తగిన బుద్ధి చెబుతారని తెలిపారు.

# దళిత వ్యతిరేకి బిఆర్ఎస్ పార్టీ...

**అధికారం కోల్పోయామనే అక్కసుతో దళితుల పట్ల సంస్కార హీనంగా ప్రవర్తించిన బిఆర్ఎస్ ఎంఎల్సీ తాత మధు**

**గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి వెల్లడి**



రంగా రెడ్డి అక్షిత బ్యూరో: శాసనసభ స్పీకర్ పై పరుష పదజాలంతో దూషించిన బి ఆర్ ఎస్ పార్టీ ఎమ్మెల్సీ తాత మధు ని తక్షణమే సస్పెండ్ చేసి కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇబ్రహీం పట్నం అంబేద్కర్ చౌరస్తాలో బి ఆర్ ఎస్ పార్టీ ఎంఎల్సీ తాత మధు దిష్టిబొమ్మను దగ్ధం చేసి చావు డప్పు కొట్టి నిరసన వ్యక్తం చేసిన కాంగ్రెస్ పార్టీ.

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర దళిత విభాగం పిలుపు మేరకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకు ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొంకని విజయ్ మాదిగ ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం దళితుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న,కించపరిచే మాటలు మాట్లాడుతున్న బి ఆర్ ఎస్ పార్టీ కి వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు.

భారత రాజ్యాంగం కల్పించిన అత్యున్నతమైన పవిత్ర పీఠంపై ఆసీనులై ఉన్న దళిత బిడ్డ...గౌరవ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై దొరల గడీల బానిస ఎమ్మెల్సీ తాతా మధు ఇష్టానుసారంగ నోరుపారేసుకోవడం బి ఆర్ ఎస్ పార్టీ యొక్క దళిత వ్యతిరేక వైఖరికి అహంకారానికి నిదర్శనం... అధికారం కోల్పోయామనే అక్కసుతో ..దళిత నాయకత్వం ఎదుగుతుంటే చూసి ఓర్వలేక రాజ్యాంగ వ్యవస్థలను కించపరిచేలా మాట్లాడటం బి ఆర్ ఎస్ పార్టీ సంస్కారహీనత కు పరాకాష్ట. స్పీకర్ తల్లిని అవమానించేలా మాట్లాడటం అందరికీ జరిగిన అవమానంగా భావిస్తున్నాం. మనందరం ముక్త కంఠంతో ఖండించాల్సిన అవసరం ఉంది. రాజకీయాలకు అతీతంగా మనం వ్యవహరించాలి. ఇలాంటి దుర్మార్గపు పోకడలను నియంత్రించాలి

ఇది అత్యంత తీవ్రమైన నేరం. సభా ప్రాంగణంలో సభాపతి పై అంత అభ్యంతరకరమైన భాష. సభాపతి ని, ఆయన కుటుంబ సభ్యులను అవమానిస్తూ మాట్లాడారు. ఇది కేవలం దళితులకు జరిగిన అవమానం కాదు. ఇది అందరికీ జరిగిన అవమానం.ఇది తెలంగాణ చరిత్రలో చీకటి రోజు అని, ఇది కేవలం స్పీకర్ కి కాదు 4 కోట్ల ప్రజల ఆత్మగౌరవానికి జరిగిన అవమానమని అన్నారు.భారతదేశ చరిత్రలో ఏ చట్టసభల్లోనూ ఇలాంటి దుర్మార్గమైన, హేయమైన సంఘటన జరగలేదని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి సభ్యుడు మాట్లాడాల్సిన అవసరం ఉంది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ఇంతటి దుర్మార్గమైన మాటలు ఎవరూ మాట్లాడకూడదు.సభా మర్యాదను కించపరిచిన సభ్యుడిని వెంటనే అనర్హుడిగా ప్రకటించాలని, ప్రతిపక్ష నాయకులు సభకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.అసెంబ్లీ కి రాకుండా వారిని ప్రోత్సహించిన బి ఆర్ ఎస్ ప్రతి పక్షనేత కేసీఆర్ తక్షణమే క్షమాపణ చెప్పి రాజీనామా చేయాలని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు క్యారగారి శ్రీధర్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొత్త కురుమ శివకుమార్, రాచర్ల వెంకటేశ్వర్లు,మంకాల దాసు,కొంగర విష్ణు వర్ధన్ రెడ్డి,కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గౌస్ పాషా,సింగల్ విండో చైర్మన్ హన్మంత్ రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త కురుమ మంగమ్మ,కౌన్సిలర్స్ నీలం భాను బాబు,దారు రాఘవేందర్,దొంతరమోని భార్గవి రాజురామదాస్ నాయక్,మార్కెట్ డైరక్టర్ మహేష్ గౌడ్, పెద్దగారి శ్రీకాంత్,బుగ్గ రాములు,కోడూరు రమేష్,ఈగల రాములు,ఏర్పుల రాజు,సతీష్, సత్య వాణి,ప్రేమ్, రమాకాంత్ రెడ్డి,రామకృష్ణ యాదవ్,భాను,సుమన్, కిరణ్, నగేష్,అయాన్, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.



# కేసీఆర్ తాత మధు దిష్టిబొమ్మల దగ్ధం

**ఎమ్మెల్సీ తాత మధును వెంటనే సస్పెండ్ చేయాలి: సూర దేవరాజు**



రాజన్న సిరిసిల్ల జిల్లా అక్షిత బ్యూరో: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు అసెంబ్లీ ప్రాంగణంలో స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆరోపిస్తూ సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. సిరిసిల్ల పట్టణం లో కాంగ్రెస్ నాయకులు తాత మధు, కేసీఆర్‌ల దిష్టిబొమ్మలను దగ్ధం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు సుర దేవరాజు మాట్లాడుతూ.. అసెంబ్లీ ప్రాంగణంలో స్పీకర్‌పై తాత మధు అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి స్పీకర్‌గా ఉన్నందుకు ఆయనను అసభ్య పదజాలంతో దూషించడం దళితులను అవమానించడమేనని అన్నారు. తాత మధు వ్యాఖ్యలు రాష్ట్రంలోని ప్రజలందరినీ అవమానించేలా ఉన్నాయని విమర్శించారు.

తాత మధు వెంటనే తన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పాలని, భవిష్యత్‌లో దళితులను అవమానించేలా వ్యాఖ్యలు చేస్తే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. తాత మధుపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేసి, ఎమ్మెల్సీ పదవి నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.


మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల సొమ్ముతో జీతం తీసుకుంటూ ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రతిపక్ష నాయకుడిగా తన బాధ్యతలను సైతం మర్చిపోయారని విమర్శించారు. దళితుడు స్పీకర్‌గా ఉన్నందుకే అసెంబ్లీకి రావడం లేదంటూ ఆరోపిస్తూ, ఇది దళితుల పట్ల ఉన్న చిన్నచూపుకు, దొరల అహంకారానికి నిదర్శనమని అన్నారు.

అలాగే కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీపై కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేశారని సూర దేవరాజు ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీని అవమానించే విధంగా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.

దిష్టిబొమ్మలు దగ్ధం చేసే సమయంలో కాంగ్రెస్ నాయకులు, పోలీసుల మధ్య కొంతసేపు తోపులాట చోటుచేసుకుంది. అనంతరం కాంగ్రెస్ నాయకులు తమ నిరసనను కొనసాగించారు.

ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఆడెపు చంద్రకళ, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకునూరి బాలరాజు, జిల్లా ఆర్టీఏ మెంబర్ సంగీతం శ్రీనాథ్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్.కె. రియాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాగుల జగన్, కౌన్సిలర్లు కూరపాటి శ్రీశైలం, లింగంపల్లి గంగరాజు, పట్టణ ఉపాధ్యక్షులు బొప్ప దేవయ్య, నీలి రవీందర్, కత్తెర దేవదాసు, నేదురి లక్ష్మణ్, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు దేవరాజ్ రెడ్డి, కాసర్ల రాజు, పట్టణ సీనియర్ కాంగ్రెస్ నాయకులు, వార్డు అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పాశం గోపాల్ రెడ్డి నూతన గృహప్రవేశానికి హాజరైన ప్రభుత్వ విప్ వేముల వీరేశం



నకిరేకల్ అక్షిత ప్రతినిధి: నార్కట్‌పల్లి మండలం ఎం. యోదవెల్లి గ్రామానికి చెందిన పాశం గోపాల్ రెడ్డి నూతనంగా నిర్మించుకున్న గృహంలో నిర్వహించిన గృహప్రవేశ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన గృహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే వేముల వీరేశం, పాశం గోపాల్ రెడ్డి కుటుంబ సభ్యులను ఆత్మీయంగా పలకరించి నూతన గృహప్రవేశ శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి పచ్చని అలియాబాద్ ను నిర్మిద్దాం

**చైర్ పర్సన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి**



మేడ్చల్, అక్షిత ప్రతినిధి: పర్యావరణ పరిరక్షణతో పాటు అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలో పచ్చదనాన్ని పెంపొందించడమే లక్ష్యంగా మున్సిపాలి టీ ఆధ్వర్యంలో వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 7, 8, 9, 17, 18, 19, 20వ వార్డుల్లో ఇంటింటికీ 6 మొక్కల చొప్పున పంపిణీ చేశారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని నిరంతరం సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు సూచించారు. ఇళ్ల పరిసరాల్లో మొక్కలు నాటి, వాటికి క్రమం తప్పకుండా నీరు అందిస్తూ సంరక్షించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కంఠం శిరీష కృష్ణా రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకట్ రెడ్డి, కౌన్సిలర్లు రాంప్రసాద్, మౌనిక దినేష్, మున్సిపల్ ఏఈఈ సనా షాహీన్, మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## గూడెంలో అభివృద్ధి పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్



రాజన్న సిరిసిల్ల, అక్షిత: ముస్తాబాద్ మండలంలోని గూడెం గ్రామంలో చేసిన పలు అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గూడెంలో ఆరు బ్లాక్ లలో మొత్తం 48 ఇండ్లు జీ ప్లస్ విధానంలో ఇందిరమ్మ ఇండ్లు ఉండగా, జిల్లా కలెక్టర్ పరిశీలించి.. మొత్తం ఎన్ని కుటుంబాలు నివాసం ఉన్నాయి?సౌకర్యాలపై ఆరా తీశారు. డీఎంఎఫ్టీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఎంపీ ల్యాడ్స్ తో బోర్ వేయగా, జిల్లా కలెక్టర్ ప్రారంభించారు.కార్యక్రమంలో హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు, డీఈ సాజిద్, తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీఓ లచ్చాలు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసిన బీఆర్ఎస్ నాయకులు



**మేడ్చల్, అక్షిత ప్రతినిధి:** ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని నిరసిస్తూ సైబారాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ డివిజన్ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు వినతిపత్రం అందజేశాశారు. అనంతరం అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడిని ఖండిస్తూ మేడ్చల్ లో బీఆర్ఎస్ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మహిళా నాయకురాళ్లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన 420 హామీలలు, 13 డిక్లరేషన్ లు, 6 గ్యారంటీలా పేరుతో ప్రజలను మోసం చేసిందన్నారు. 100 రోజుల్లో హామీలను నెరవేరుస్తామని చెప్పి 1000 రోజులైన నెరవేర్చలేదాన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే గుండాల ప్రభుత్వమని అసెంబ్లీ ప్రాంగణంలో మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడే నిదర్శనం అన్నారు. ఎమ్మెల్యేల పై కొంతైనా మర్యాద లేకుండా ప్రవర్తించడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర అభివృద్ధిపై పాలన మరిచిన కాంగ్రెస్ పార్టీ రౌడీలా పాలన కొనసాగిస్తుందాన్నారు. ఈ కార్యక్రమం లో మేడ్చల్ జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ భాస్కర్ యాదవ్, ఎల్లంపేట్ మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీదేవి రమేష్, కౌన్సిలర్ నిషిత రెడ్డి, మేడ్చల్ మున్సిపల్ మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఆకిటి నవీన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు తుడుం గణేష్, ఉమా నాగరాజు, మాజీ సర్పంచ్ లు బాబు యాదవ్, మహేందర్ ముదిరాజ్, బీ ఆర్ టీ యు మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సంబు ప్రభాకర్, నాయకులు విష్ణు చారి, సైలెందర్, సుశాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ సీఐ జయశ్రీ బాధ్యతల స్వీకరణ

### అక్రమ మద్యం, గంజాయిపై చర్యలకు వినతి



**నర్సంపేట అక్షిత ప్రతినిధి :** నర్సంపేట ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జయశ్రీని వినియోగదారుల సంఘం, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు స్థానిక కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డివిజన్ పరిధిలోని పలు సమస్యలపై ఆమెకు వినతిపత్రం సమర్పించారు.

పల్లెలు, పట్టణాల్లో అనుమతి లేకుండా కొనసాగుతున్న అక్రమ బెల్ట్ షాపులను వెంటనే తొలగించాలని, మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని కోరారు. మద్యం దుకాణాల ఎదుట వాహనాలు నిలపడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగి నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని పేర్కొన్నారు. ప్రధానంగా యువత, విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తున్న గంజాయి, డ్రగ్స్ మాఫియాపై నిఘా ఉంచి సరఫరాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలో జిల్లా సమాచార కేంద్రం అధ్యక్షులు గిరిగాని సుదర్శన్ గౌడ్, స్వయంకృషి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు బెజ్జంకి ప్రభాకర్, ఎస్సీ, ఎస్టీ కన్వీనర్ బోయిన వెంకటస్వామి, కాసుల వెంకటాచారి, వెంకట్రాం, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# మార్క్సిస్టు ముద్దు బిడ్డ టివిఆర్ చంద్రం.....!

### టివిఆర్ చంద్రం పుస్తకావిష్కరణ సభను విజయవంతం చేయాలి

### సిపిఐ ఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు



**భద్రాచలం,అక్షిత న్యూస్:** కడవరకు సిద్ధాంత, ఆచరణ కేవలం మార్క్సిస్టు లకే సాధ్యమని.. బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం నిరంతరాయంగా పోరాటాలు నిర్వహించిన మార్క్సిస్టు ముద్దుబిడ్డ టివిఆర్ చంద్రం అని సిపిఐఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. ఈనెల 10న భద్రాచలం పట్టణంలోని కేకే ఫంక్షన్ హాల్ లోజరగనున్న టీవీ ఆర్ చంద్రం పుస్తక ఆవిష్కరణ సభ విజయవంతం చేయాలని ఆయన కోరారు. మారుమూల గ్రామమైన కూనవరంలో జన్మించిన టివిఆర్ చంద్రం వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత అధ్యక్షుడిగా జాతీయస్థాయిలో ఉద్యమాలకు నాయకత్వం వహించారు. భద్రాచలం నియోజకవర్గం లో కూనవరం కేంద్రంగా సిపిఐఎం శాఖలకు టివిఆర్ చంద్రం శ్రీకారం చుట్టారని మచ్చా గుర్తు చేశారు. 1931 లో జన్మించిన టివిఆర్ చంద్రం కమ్యూనిస్టు పార్టీ చేస్తున్న పోరాటాలకు ఆకర్షితుడై పని చేసి సిపిఐ ఎం రాష్ట్ర స్థాయి నాయకుడిగా ఎదిగారని అన్నారు. 2006 సెప్టెంబర్ 7న వయోభారంతో టివిఆర్ చంద్రం మృతి చెందినప్పటికీ ఈ ప్రాంత ప్రజల గుండెల్లో మార్క్సిస్టు పార్టీ నిర్వహించే ప్రతి కార్యక్రమంలో చంద్రం సజీవంగానే ఉన్నారని అన్నారు. టీవీఆర్ చంద్రం మరణించి 20 ఏళ్లు గడుస్తున్న నియోజవర్గ వ్యాప్తంగా నేటికీ టీవీ చంద్రం వర్ధంతి సభలు నిర్వహిస్తున్నామని అన్నారు. అమరవీరులు తమ జీవితాలను ప్రాణాలను త్యాగం చేసి నిర్మించిన పార్టీని కాపాడుకోవటమే పార్టీ కార్యకర్తలపై ఉన్న ప్రధాన కర్తవ్యం అని మచ్చ వెంకటేశ్వర్లు అభిప్రాయపడ్డారు. రాజకీయంగా వస్తున్న ఒడిదుడుకులను ఎదుర్కొని భద్రాచలం నియోజకవర్గం లో సిపిఐఎం పూర్వ వైభవం సంతరించుకుంటుందని జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రాంత ప్రజలకు మార్క్సిస్ట్ పార్టీ ఎర్రజెండా నే అండ ధైర్యమని మచ్చ స్పష్టం చేశారు

**మన్యం మాణిక్యాలు మార్క్సిస్ట్ అమరవీరులు....**

ఆదివాసి గిరిజన పేద బడుగు బలహీన వర్గా ప్రజల కోసం తమ జీవితాలను త్యాగాలు చేసి తమ ప్రాణాలను తునప్రాయంగా విడిచిన మార్క్సిస్టు పార్టీ అమరవీరులు, మన్యం మాణిక్యాలు అని మచ్చ స్పష్టం చేశారు. ప్రజా పోరాటాలను చూసి ఓర్వలేని నరహంతకు నక్సలైట్లు బండారు చందర్రావు, బత్తుల భీష్మారావు, శ్యామల వెంకట్ రెడ్డి, మడివి మూకయ్య, పులిరామయ్య, మడకం పంతులు వంటి నేతలను అత్యంత కిరాతకంగా హత్య చేశారని అన్నారు. టీవీ ఆర్ చంద్రం, ఎలమంచి సీతారామయ్య, బివిఎస్ రామయ్య వంటి నాయకులు ఎన్నో దాడులను నిర్బంధాలను ఎదిరించి పనిచేశారని, ప్రజాప్రతినిధులుగా కుంజా బుజ్జి సున్నం రాజయ్యలు నిస్వార్థ సేవలు అందించి కడవరకు మార్క్సిస్టు జెండాను వీడకుండా మన్యం మాణిక్యాలుగా నిలిచారని అన్నారు. దేశంలో రోజురోజుకీ పెరిగిపోతున్న మతోన్మాద సామ్రాజ్యవాద విధానాలకు వ్యతిరేకంగా పోరాటమే అమరవీరులకు మనమిచ్చే నిజమైన నివాళిని మచ్చ స్పష్టం చేశారు. అమరవీరుల స్ఫూర్తితో ఆదివాసి బడుగు బలహీన వర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరాయంగా పార్టీ శ్రేణులు ఉద్యమాలను నిర్వహించాలని మచ్చ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.

**ఈ నెల 10న టీవీఆర్ చంద్రం పుస్తకావిష్కరణ సభ**

టీవీఆర్ చంద్రం జీవిత చరిత్ర ఆధారంగా పుస్తకావిష్కరణ సభ ఈనెల 10వ తారీకు పట్టణంలోని కేకే ఫంక్షన్ హాల్ లో జరగందని ఆ సభకు పార్టీ శ్రేణులు, అభిమానులు, పెద్ద సంఖ్యలో హాజరు కావాలని మచ్చ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈ ఆవిష్కరణ సభకు సిపిఐఎం రాష్ట్ర , జిల్లా నాయకులు హాజరవుతున్నారని అన్నారు. ఈ ప్రాంత ప్రజల కోసం పనిచేసిన అమరవీరుల చరిత్రలను తెలుసుకునే పుస్తకావిష్కరణ సభకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మచ్చ కోరారు.

# ఆరు గ్యారంటీలు.. 420 హామీలు వెంటనే అమలు చేయాలి

### కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ సిరిసిల్లలో బీఆర్ఎస్ భారీ రాస్తారోకో



**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో భారీ రాస్తారోకో నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఎనిమిదో రోజు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. 2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీలు, 420 హామీలను ప్రజలకు ప్రకటించి, అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో హామీలను అమలు చేస్తామని చెప్పిందన్నారు. అయితే ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు దాటుతున్నా ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు.

రైతులు, చేనేత కార్మికులు, ఆటో కార్మికులు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, విద్యార్థులు, యువతతో పాటు వివిధ వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజల పక్షాన ప్రభుత్వ వైఖరిని ఎండగట్టేందుకే రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడుతున్నామని తెలిపారు.

**అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం**

నిరసన కార్యక్రమంలో భాగంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు.

**ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై పోలీసుల తీరును ఖండించిన బీఆర్ఎస్**

అదేవిధంగా సోమవారం రాష్ట్రంలో చోటుచేసుకున్న పరిణామాలను బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు శాసనసభ సమావేశాలకు హాజరై ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించకుండా పోలీసు యంత్రాంగం ద్వారా అడ్డుకున్నారని ఆరోపించారు.ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పట్ల కనీస మర్యాద పాటించకుండా పోలీసులు వ్యవహరించారని, వారిపై చేయి చేసుకుని అవమానించేలా ప్రవర్తించారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ప్రజా ప్రతినిధులకే ఇలాంటి పరిస్థితులు ఎదురైతే సామాన్య ప్రజలు ప్రభుత్వాన్ని ఎలా ప్రశ్నించగలరని ప్రశ్నించారు.

ప్రజాస్వామ్యంలో ప్రజలకు తమ నిరసనను తెలియజేసే హక్కు ఉందని, ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా అంబేద్కర్ చౌరస్తాలో భారీగా రాస్తారోకో నిర్వహించడంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఈ కార్యక్రమంలో చీూఖీూజూదీ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ తుల ఉమ, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, సిరిసిల్ల శాఖ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ దార్ల సందీప్, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

# హామీలు నెరవేర్చేదాకా.. పోరాటం ఆగదు

**బీఆర్ఎస్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్ గౌడ్**

**కాంగ్రెస్ 6 గ్యారంటీలు, 420 హామీలు, 13 డిక్లరేషన్లపై బీఆర్ఎస్ సమరభేరి**



**తాండూరు అక్షిత ప్రతినిధి:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ప్రజల తరఫున తమ పోరాటం కొనసాగుతుందని బీఆర్ఎస్ తాండూర్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ నరుకుల నరేందర్ గౌడ్ అన్నారు. హామీల అమలుపై ప్రశ్నిస్తే కేసులు, బెదిరింపులతో భయపెట్టాలని చూస్తు న్నారని, ఆరోపించారు.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలో ఎన్నికల హామీలు అమలు కాలేదని నిరసిస్తూ, చేపట్టిన వారం రోజుల కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం తాండూర్ బస్టాండ్ కూడలిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సీనియర్ నాయకులు పంజుగుల విఠల్ రెడ్డి నేతృత్వంలో నాయకులు నివాళులు అర్పించారు. అనంతరం వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా నరేందర్ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలు, 420 హామీలు, 13 డిక్లరేషన్లు ప్రకటించి ప్రజలను ఆకట్టుకుందని, అధికారంలోకి వచ్చి 1000 రోజులు గడుస్తున్నా హామీల అమలుపై స్పష్ట మైన సమాధానం ఇవ్వడం లేదని



విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. అసెంబ్లీ వద్ద మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పట్ల జరిగిన వ్యవహారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. మహిళా ప్రజాప్రతినిధుల పట్ల కనీస గౌరవం లేకుండా వ్యవ హరించడం బాధాకరమని పేర్కొంటూ, ఈ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, డిమాండ్ చేశారు. ప్రభుత్వ హామీలపై ప్రశ్నించే గొంతులను అణచి వేసేందుకు కేసులు, బెదిరింపులను ప్రయోగిస్తున్నారని ఆరోపించారు. ఎంతగా భయపెట్టినా వెనక్కి తగ్గేది లేదని, ప్రశ్నించే గొంతును నొక్కితే ప్రజల గొంతు మరింత బలంగా వినిపిస్తుందని అన్నారు.

తాండూర్ ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే వరకు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజల తరఫున నిరంతరం పోరాడుతామని, నరేందర్ గౌడ్ తెలిపారు. ప్రజలకు రావాల్సిన ప్రతి పైసా సాధించే వరకు బీఆర్ఎస్ వెనక్కి తగ్గదన్నారు.

**మహిళా ఎమ్మెల్యేల పట్ల వ్యవహరించిన తీరును ఖండించిన బీఆర్ఎస్**

గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజ్ గౌడ్ మాట్లాడుతూ.. ఎన్నికల హామీల పేరుతో మహిళ లను మభ్యపెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. హామీలను ప్రశ్నించేందుకు అసెంబ్లీకి వచ్చిన ఇద్దరు మహిళా ఎమ్మెల్యేల పట్ల జరిగిన వ్యవహారాన్ని ఖండిస్తూ, దీనికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలని, డిమాండ్ చేశారు. తాండూర్ నీటి సమస్య, ప్రభుత్వ ఆసుపత్రి విషయంలో ప్రజలకు అన్యాయం జరిగితే స్థానిక ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిని ప్రజలు క్షమించరని, అన్నారు. హామీలన్నీ నెరవేర్చే వరకు బీఆర్ఎస్ ప్రజల తరఫున పోరాడు తుందని, ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తామని, పేర్కొన్నారు.

మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దీపా నర్సింహులు మాట్లాడుతూ.. అసెంబ్లీ వద్ద మహిళా ఎమ్మెల్యేల పట్ల జరిగిన తీరును తీవ్రంగా ఖండించారు. మహిళా పోలీసులను ఏర్పాటు చేయకుండా పురుష పోలీసులతో వ్యవహరించడం దారుణ మన్నారు. ఇది ఇద్దరు మహిళా ఎమ్మెల్యేల అవమానం మాత్రమే కాకుండా తెలంగాణ మహిళా లోకానికి జరిగిన అవమానంగా అభి వర్ణించారు. ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని, డిమాండ్ చేశారు.

**మాణిక్‌రావు మహారాజ్‌కు ఘన నివాళులు**

అనంతరం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సీనియర్ నాయకులు పంజుగుల విఠల్‌రెడ్డి పీపుల్స్ డిగ్రీ కాలేజీ వద్దకు చేరుకుని మాజీ మంత్రి, విద్యా వికాస్ సమితి ట్రస్ట్ వ్యవస్థాపకులు ఎం. మాణిక్‌రావు మహారాజ్ చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సీనియర్ నాయకులు పంజుగుల విఠల్‌రెడ్డి, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ నరుకుల నరేందర్ గౌడ్, పెట్లోళ్ల నర్సింహులు, శ్రీనివాస్ చారి, వెంకటరెడ్డి, బీఆర్ఎస్ కౌన్సిలర్లు, మహిళా నాయకులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేత్రదానం మహాదానం

**నేత్రదానంపై అవగాహన పెంచుకోవాలి**

**మేయర్ కొలగాని శ్రీనివాస్**




**కరీంనగర్ అక్షిత బ్యూరో:** 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవం మరియు జాతీయ నేత్రదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్‌లోని వాసన్ ఐ కేర్ హాస్పిటల్‌కు చెందిన వాసన్ ఐ బ్యాంక్ ఆధ్వర్యంలో నేత్రదాన అవగాహన సదస్సు, అవగాహన నడకను నిర్వహించారు. ఈ సందర్భంగా నేత్రదాన ఉద్యమంలో విశేషంగా సేవలందిస్తున్న నేత్రదాతల కుటుంబ సభ్యులు, వాలంటీర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆగస్టు 25వ తేదీ నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు నేత్రదానంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్న వాసన్ ఐ కేర్ హాస్పిటల్ యాజమాన్యాన్ని అభినందించారు.

కార్నియల్ బ్లైండ్‌నెస్‌ను తగ్గించేందుకు సమాజం నుంచి మరింత మద్దతు లభించేలా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రారంభించిన "స్కాన్ ప్లెడ్జ్" కార్యక్రమాన్ని మేయర్ ప్రశంసించారు. నేత్రదానం పట్ల ప్రజల్లో ఉన్న అపోహలు, అపార్థాలను తొలగించి, నేత్రదానం ద్వారా మరొకరికి చూపును అందించవచ్చనే సందేశాన్ని విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు."నేత్రదానం మహాదానం. మన మరణానంతరం కూడా మరొకరి జీవితంలో వెలుగులు నింపే గొప్ప అవకాశం నేత్రదానం ద్వారా లభిస్తుంది. ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి నేత్రదానానికి ప్రతిజ్ఞ చేయాలి" అని మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

కరీంనగర్‌తో పాటు పొరుగు జిల్లాల్లో కూడా నేత్రదాతల నుంచి కార్నియాలను సేకరించేందుకు వాసన్ ఐ కేర్ హాస్పిటల్‌లో 24 గంటలూ, 7 రోజులూ అందుబాటులో ఉండే కార్నియా సేకరణ టెక్నీషియన్ సేవలు అందిస్తున్నారని మేయర్ తెలిపారు. నేత్రదాన ఉద్యమానికి వైద్య సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమిష్టిగా సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా వాసన్ ఐ కేర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ మైథిలి, డాక్టర్ టి. హరిత గౌడ్, డాక్టర్ శ్రీలేఖ నేత్రదానానికి సంబంధించిన అపోహలు, అపార్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. భారతదేశవ్యాప్తంగా ఉన్న ఏఎస్‌జీ--వాసన్ ఐ కేర్ హాస్పిటల్స్‌లో విజయవంతంగా కొనసాగుతున్న "స్కాన్ ప్లెడ్జ్" కార్యక్రమం గురించి వివరించారు.

అనంతరం నేత్రదాతల కుటుంబ సభ్యులు, వాలంటీర్లు, ఎన్జీవో ప్రతినిధులను ముఖ్య అతిథి మేయర్ కొలగాని శ్రీనివాస్ సన్మానించారు.

ఈ కార్యక్రమంలో వాసన్ ఐ కేర్ హాస్పిటల్ సెంటర్ మేనేజర్ వంశీ, వాసన్ ఐ బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ అరవింద్, సీనియర్ సిబ్బంది కిరణ్, ఆసుపత్రి సిబ్బంది, నేత్రదాతల కుటుంబ సభ్యులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## దిష్టిబొమ్మను దహనం చేసినా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు



**నంగునూరు, అక్షిత ప్రతినిధి:** అసెంబ్లీ స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ నంగునూర్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. మండలంలోని రాంపూర్ ఎక్స్‌రోడ్ వద్ద కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తాతా మధుసూదన్ దిష్టిబొమ్మను దహనం చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న అసెంబ్లీ స్పీకర్‌పై బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఎమ్మెల్సీ అనుచిత వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నాం అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తులకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని పేర్కొన్నారు. అసెంబ్లీ వంటి అత్యున్నత ప్రజాస్వామ్య వేదికకు సంబంధించిన అంశాల్లో ప్రజాప్రతినిధులు సంయమనం పాటించాలని, హుందాగావ్యవహరించాలని కాంగ్రెస్ నాయకులు సూచించారు. రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి స్పీకర్‌పై ఈ విధంగా వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విలువలకు భంగం కలిగించే వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని స్పష్టం చేశారు. తాతా మధుసూదన్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, స్పీకర్‌కు క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాపోల్. రాజ్ బహుదూర్ రెడ్డి, డీసీసీ జనరల్ సెక్రెటరీ రంగు అశోక్, ఏఎంసి వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్ ఏఎంసి డైరెక్టర్లు ఎండీ ఇమ్రాన్, రంగారెడ్డి, రాజేశ్వర్, జీవన్ నాయక్,ప్రభాకర్,చేర్యాల కృష్ణ, పాక్స్ డైరెక్టర్లు, నంగునూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పర్యావరణ పరిరక్షణపై జిల్లా స్థాయి పోటీలు



**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** రామన్నపేట స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై వివిధ పోటీలు ఈ నెల11వ తేదీన నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాహత్ ఖానం తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనవచ్చని ఆమె పేర్కొన్నారు. స్టోరీ రైటింగ్, స్లోగన్ రైటింగ్, ఫోటోగ్రఫీ, రీల్ మేకింగ్, క్విజ్, డిబేట్ తదితర అంశాలలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలలో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ రంగస్థల నటుడు బాపనపల్లి వెంకటస్వామి ప్రత్యేక ఆకర్షణగా పాల్గొంటారని, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# తాతా మధును బర్తరాఫ్ చేయాలి

**బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తీరుపై**
**కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం**



**మేడ్చల్, అక్షిత ప్రతినిధి:** శాసనసభ స్పీకర్‌ను అసభ్యకరమైన పదజాలంతో దూషించడం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమే అని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తీరును వ్యతిరేకిస్తూ మంగళవారం అలియాబాద్ లోని ఓ ఫంక్షన్ హాల్ లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ శాసన సభకు అధ్యక్షత వహించే స్పీకర్ పదవికి గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్క శాసనసభ్యుడిపై ఉందని, వ్యక్తిగత దూషణలకు దిగడం సరైన పద్ధతి కాదని వారు స్పష్టం చేశారు. శాసనసభ స్పీకర్ పై పరుష పదజాలంతో దూషించిన బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ తాత మధు ని తక్షణమే సస్పెండ్ చేసి కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ శిరీష కృష్ణారెడ్డి, అలియాబాద్, మూడు చింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంకి రమేష్, దోసకాయల వెంకటేశం, నాయకులు వేణుగోపాల్ రెడ్డి, వెంకటేష్, బస్వారెడ్డి, రాంప్రసాద్ గౌడ్, శశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా 'వరల్డ్ ఫిజియోథెరపీ డే' వేడుకలు

**ముఖ్య అతిథిగా పాల్గొన్న**
**నగర మేయర్ గుమ్మల మమతా**



**మహబూబ్ నగర్,అక్షిత న్యూస్:** దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలేజీలో అంతర్జాతీయ ఫిజియోథెరపీ దినోత్సవం పురస్కరించుకుని కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో వేడుకలు అత్యంత ఘనంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి నగర ప్రథమ పౌరురాలు, నగర మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్ ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... నేటి ఆధునిక జీవనశైలిలో ఫిజియోథెరపీ ప్రాధాన్యత రోజురోజుకూ పెరుగుతోందని పేర్కొన్నారు. ఎలాంటి శస్త్రచికిత్సలు లేకుండా రోగులను నయం చేయడంలో, వారి శారీరక దృఢత్వాన్ని పునరుద్ధరించడంలో ఫిజియోథెరపిస్టుల పాత్ర వెలకట్టలేనిదని కొనియాడారు. విద్యార్థులు చదువుతో పాటు సేవా దృక్పథాన్ని అలవర్చుకుని భవిష్యత్తులో ఉత్తమ నిపుణులుగా ఎదగాలని మేయర్ ఆకాంక్షించారు.

దినోత్సవం సందర్భంగా విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని, ఉత్సాహాన్ని నింపేందుకు కాలేజీ ప్రాంగణంలో నిర్వహించిన పలు ఆటల పోటీలలో ప్రతిభ కనబరిచిన విజేతలకు విన్నర్స్, రన్నర్స్ కు మేయర్ స్వయంగా ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మల్టీ-పారామెట్రిక్ డయాగ్నస్టిక్ సిస్టమ్స్ 75 రకాల వైద్య పరీక్షలు

**కలెక్టర్ కె హరిత**




**ఆసిఫాబాద్ అక్షిత బ్యూరో:** జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (నాహా), ఏవియానిక్స్ డివిజన్ హైదరాబాద్ మరియు ఓ మిని యాక్టివ్ ఫౌండేషన్ వారి సాకారంతో సీఎస్ఆర్ కార్యక్రమం ద్వారా సమకూర్చిన 22 మల్టీ-పారామెట్రిక్ డయాగ్నస్టిక్ సిస్టమ్ ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 75 రకాల వైద్య పరీక్షలు నిర్వహించడానికి చర్యలు తీసుకుట్టునట్టు కలెక్టర్ కె హరిత అన్నారు మంగళవారం జిల్లా కలెక్టరేట్ భావన సముదయలోని సమావేశ మందిరంలో మల్టి పారమెట్రిక్ డయాగ్నస్టిక్ సిస్టమ్ ను అదనపు



కలెక్టర్ యువరాజ్ మార్మాట్ ఓమిని యాక్టివ్ ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ బటియా తో కలిసి కలెక్టర్ కె హరిత ప్రారంభించారు .

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధునాతన వైద్య పరికరాల ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే రోగుల వైటల్స్ మానిటరింగ్, రక్త పరీక్షలు, ఆరోగ్య సమస్యలను ముందస్తుగా గుర్తించడం వంటి సేవలను మరింత సమర్థవంతంగా అందించే అవకాశం ఉంటుంది. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆరోగ్య సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ఈ పరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో సహకరిస్తున్న హే ఏ ఎల్ సంస్థకు జిల్లా యంత్రాంగం కృతజ్ఞతలు తెలిపింది. ఆధునిక వైద్య సాంకేతికతను ప్రాథమిక స్థాయిలో అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రజల ఆరోగ్య పరిరక్షణకు మరింత మేలు జరుగుతుందని ఆమె తెలిపారు తెలిపారు.

జిల్లా ప్రజలకు ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు ఇటువంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని కలెక్టర్ తెలిపారు .ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నాగేంద్ర అకాంక్షిత జిల్లా సమన్వయ కర్త బాలరాజు వైద్య అధికారులు ల్యాబ్ టెక్నీషియన్స్ నర్సులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# మన గణపతి - మట్టి గణపతి

**పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులనే పూజిద్దాం**
**నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**




**కరీంనగర్ అక్షిత బ్యూరో:** పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, వినాయక చవితి సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి గణపతులను ప్రతిష్టించి పూజించాలని కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. "హమారా ఉన్నత మార్గ్" (హమ్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో "మన గణపతి -- మట్టి గణపతి" అనే నినాదంతో రూపొందించిన వాల్ పోస్టర్‌ను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తన చేతుల మీదుగా ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున, ప్రతి ఒక్కరూ సహజసిద్ధమైన మట్టితో తయారు చేసిన గణపతి విగ్రహాలను పూజించాలని సూచించారు. "మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం"అనే సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. "మట్టి గణపతి మహాగణపతి" అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వినాయక చవితి సందర్భంగా ప్రతి ఇంట్లో మట్టితో తయారు చేసిన గణపతిని ప్రతిష్టించి పూజించాలని ప్రజలను కోరారు.

అదేవిధంగా వినాయక మండపాల్లో మట్టితో తయారు చేసిన గణపతి విగ్రహాలను ప్రతిష్టించే నిర్వాహకులను ప్రోత్సహించేందుకు సంస్థ తరపున ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. నవరాత్రుల్లో ఒక రోజున మట్టి గణపతిని ప్రతిష్టించిన మండపాలను సందర్శించి నిర్వాహకులను శాలువా, మెమొంటోలతో ఘనంగా సత్కరిస్తామని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు ధనపురి సాగర్, సంస్థ సభ్యులు తోడుపునూరి తిరుపతి, కరీంనగర్ కార్పొరేషన్ కార్పొరేటర్లు తోట అనిల్, శరత్ చంద్ర, అపర్ణ జితేందర్, దేవసాని సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్.ఐ.ఆర్--2026 సవరించిన షెడ్యూల్‌ను సద్వినియోగం చేసుకోవాలి...

**జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్**

**క్లెయిమ్స్, అభ్యంతరాల దాఖలు**
**గడువు అక్టోబర్ 07 వరకు పొడిగింపు**

**నవంబర్ 09న తుది ఓటర్ల జాబితా ప్రచురణ**



**జగిత్యాల అక్షితబ్యూరో:** తెలంగాణలో చేపట్టిన ఎస్ఐఆర్--2026 ప్రక్రియకు సంబంధించి భారత ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్‌ను ఆమోదించిందని జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం ఓటర్ల జాబితాకు సంబంధించి క్లెయిమ్స్, అభ్యంతరాల దాఖలు గడువును సెప్టెంబర్ 16 నుంచి అక్టోబర్ 07, 2026 వరకు పొడిగించినట్లు తెలిపారు. క్లెయిమ్స్, అభ్యంతరాలపై నోటీసుల జారీ, వాటి పరిష్కార ప్రక్రియను ఆగస్టు 17 నుంచి నవంబర్ 05, 2026 వరకు కొనసాగించనున్నట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం నవంబర్ 09, 2026న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నట్లు తెలిపారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం క్లెయిమ్స్, అభ్యంతరాల దాఖలుకు 17.08.2026 నుంచి 07.10.2026 వరకు, నోటీసుల జారీ, క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారానికి 17.08.2026 నుంచి 05.11.2026 వరకు అవకాశం ఉంటుందని తెలిపారు. తుది ఓటర్ల జాబితా 09.11.2026 న ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఎస్ఐఆర్--2026 ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సవరించిన షెడ్యూల్‌పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అన్నారు. ఓటర్లు ఈ అదనపు గడువును సద్వినియోగం చేసుకుని తమ ఓటరు వివరాలను పరిశీలించుకోవాలని, వివరాల్లో ఏవైనా అభ్యంతరాలు లేదా మార్పులు అవసరమైతే నిర్ణీత గడువులోగా క్లెయిమ్స్, అభ్యంతరాలను దాఖలు చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.